


ఇక లైసెన్స్‌డ్ సర్వేయర్లు

- ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చేసిన వారు అర్హులు
- ప్రైవేటు సర్వేయర్లకు 26వ తేదీ నుంచి శిక్షణ
- జిల్లాలో 50 మందికి అవకాశం
- భూ సర్వేకు తొలగనున్న అడ్డంకులు



జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు రాబోతున్నారు. ఇప్పటి వరకు ఉన్న వారిలో అర్హత కలిగిన ప్రైవేటు సర్వేయర్లతో పాటు కొత్త వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి వారికి లైసెన్స్ జారీ చేయనున్నారు. ప్రభుత్వం నూతనంగా తెచ్చిన భూ భారతి చట్టం అమలులో వారి సేవలను వినియోగించుకుని భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని సుమారు 50 మందికి సర్వేయర్లుగా త్వరలోనే ప్రత్యేక శిక్షణ ప్రారంభించబోతోంది.

దరఖాస్తుకు ఈనెల 17 వరకు గడువు

భూభారతి అమలులో భాగంగా రాష్ట్రంలో ఐదు వేల మందికి సర్వేయర్లుగా శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లాలోని అర్హులైన వారు ఈ నెల 17వ తేదీలోగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులతో గణితం సబ్జెక్టుగా కలిగిన వారు, ఐటీఐ (డ్రాఫ్ట్‌మెన్ సివిల్), డిప్లొమా, బీటెక్ సివిల్, తత్సమాన అర్హతలు కలిగిన పాత సర్వేయర్లతో పాటు, కొత్త అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కలిపించింది. దరఖాస్తు చేసుకున్న వారికి మే 26వ తేదీ నుంచి జూలై 26వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. రెవెన్యూ పరిపాలనకు తోడుగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు శాఖ ద్వారా ఈ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వబోతున్నారు.

మూడు దశల్లో శిక్షణ

సర్వేయర్లకు మూడు దశల్లో శిక్షణ ఇస్తారు. థియరీ, టిప్పన్ ప్లాటింగ్, క్షేత్ర స్థాయి విషయాల్లో శిక్షణ ఉంటుంది. ఆ తరువాత 40 రోజుల పాటు మండల సర్వేయర్ కింద ప్రత్యేక శిక్షణ ఇస్తారు. తర్వాత జిల్లా స్థాయిలో వేర్వేరుగా పరీక్ష నిర్వహిస్తారు. అందులో పాసైన వారికి ఫైనల్ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. అది పాసైతే లైసెన్స్ కోసం వారు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన వారు సర్వే చేసేందుకు అర్హులు. వారు చేసే సర్వేకు అధికారిక గుర్తింపు ఉంటుంది. భూ భారతి చట్టం అమల్లోనూ సర్వే పనుల కోసం వారి సేవలను పరిగణనలోకి తీసుకోనున్నారు.

తీరనున్న సర్వేయర్ల కొరత..

జిల్లాలో ఇక సర్వేయర్ల కొరత తీరనుంది. ప్రస్తుతం జిల్లాలో 20 మండలాల పరిధిలో 14 మంది ప్రభుత్వ సర్వేయర్లు ఉన్నారు. భీమారం, ఎండపల్లి, సారంగాపూర్, మల్లాపూర్, బీర్‌పూర్, బుగ్గారం మండలాల్లో సర్వేయర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రభుత్వం వివిధ పథకాల కింద భూసేకరణ చేపట్టే పనులకు వారే సర్వే చేయాల్సి రావడంతో తీవ్ర జాప్యం అవుతోంది. సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటే నెలల సమయం పడుతోంది. మరోవైపు గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి కారణంగా అనేక రకాల భూ సమస్యలు తలెత్తాయి. ఒకరి భూమి మరొకరికి పేరున పడటం, హద్దులు చెరిగిపోయాయి. దీంతో చాలా మంది సర్వేకు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే వ్యవసాయ భూములు కూడా రియల్ ఎస్టేట్‌గా మారిపోతున్నాయి. ఈ క్రమంలో నాలా కన్వర్షన్ కోసం అనేక దరఖాస్తులు వచ్చాయి. ఇలాంటి సందర్భాల్లో సర్వేయర్ల కొరత వల్ల సర్వేలో తీవ్ర జాప్యం అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అర్హత కలిగిన వారికి శిక్షణ ఇచ్చి, లైసెన్స్ జారీ చేయడం ద్వారా సర్వేయర్లుగా గుర్తింపు ఇవ్వబోతోంది. దీంతో సర్వే సమస్యలు త్వరగా పరిష్కారం కానున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి: సత్యప్రసాద్, కలెక్టర్



భూ భారతి చట్టం అమలుకు అర్హులైన సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేస్తుంది. జిల్లాలోని అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 17వ తేదీ లోగా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

ఇప్పటి వరకు 17 దరఖాస్తులు

రావుల వెంకట్‌రెడ్డి, ఏడీ, సర్వే ల్యాండ్ రికార్డ్



జిల్లాలో ఇప్పటి వరకు 17 దరఖాస్తులు వచ్చాయి. సర్వేయర్లకు లైసెన్స్‌లు ఇవ్వనుండడంతో భవిష్యత్తులో సర్వేయర్ల కొరత సమస్య తీరనుంది. ప్రస్తుతం జిల్లాలో ఆరుగురు సర్వేయర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంబంధిత మండలాల్లో ఇన్‌చార్జిలు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

నేడే పాలిసెట్

-ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష

-నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

-జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాలు ఏర్పాటు

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నిర్వహించే పాలిసెట్-2025-26 పరీక్షకు నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని జిల్లా కో ఆర్డినేటర్లు అరిగెల అశోక్, విజయ్‌మోహన్‌లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ పాలిసెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా జగిత్యాలలో 6, కోరుట్లలో 5 సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3520మంది పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు గంట ముందుగానే కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలన్నారు. ఓఎంఆర్ షీట్‌కు రెండు వైపుల విద్యార్థులు వివరాలను పూర్తి చేసి సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. హాల్ టికెట్ మీద ఫొటో ప్రింట్ కానివారు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఐడీప్రూఫ్ కింద ఆధార్‌కార్డు తెచ్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని పేర్కొన్నారు. ఈ పరీక్షకు స్టేట్ పరిశీలకులు డాక్టర్ సీహెచ్ యాదయ్య హైదరాబాద్ పర్యవేక్షిస్తారన్నారు. రూట్ ఆఫీసర్లుగా డాక్టర్ చంద్రయ్య, డాక్టర్ కొలగాని మహేష్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్‌గా పడాల తిరుపతి వ్యవహరిస్తారని తెలిపారు.

రైతులు గోదాంలను సద్వినియోగం చేసుకోవాలి

-డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు



గోదాంను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాట చేసిన గోదాంలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని పైడిమడుగు, సర్పరాజుపూర్, జోగినిపల్లి గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన గోదాంలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, సింగిల్‌విండో జిల్లా అధికారి మనోజ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ సింగిల్‌విండోలు రైతుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పైడిమడుగు, చిన్నమెట్‌పల్లి, మాదాపూర్, ఎఖీన్‌పూర్, అయిలాపూర్, కోరుట్ల సింగిల్‌విండో చైర్మన్లు జగన్‌మోహన్ రావు, బండి భూమయ్య, ఆధిరెడ్డి, నర్సరెడ్డి, సాయిరెడ్డి, భూంరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

'వినియోగదారులకు మెరుగైన సేవలతోనే గుర్తింపు'

కోరుట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన సేవలతోనే బ్యాంకులకు గుర్తింపు లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు అన్నారు. సోమవారం పట్టణంలోని కల్లూర్ రోడ్డులో కేడీసీసీ బ్యాంక్‌ను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సింగిల్ విండో జిల్లా అధికారి మనోజ్ కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి పాల్గొన్నారు.

●మల్లాపూర్: రైతుల సంక్షేమానికి సహకారం సంఘం బ్యాంకును ఏర్పాటు చేశామని డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకును కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.

'బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక సర్వాయి పాపన్న'

మల్లాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీకగా నిలిచారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, సాతారంలో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా గ్రామాల నాయకులు, గౌడ సంఘం నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విగ్రహ దాత చర్లపల్లి అనీల్ దీప్, మల్లేషం గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాసగౌడ్, సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి రూరల్: మండలంలోని మేడిపల్లి గ్రామంలో గౌడ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

-జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల అగ్రికల్చర్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు, విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని ఆమె అన్నారు. డిగ్రీ విద్యార్థులు, యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లతకు మంగళవారం మాజీ జడ్పీచైర్‌పర్సన్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వసంత మాట్లాడుతూ ఈనెల 14నుంచి జరగాల్సిన పరీక్షల విషయంలో పునరాలోచన చేయాలన్నారు. సోమవారం వరకు హాల్‌టికెట్లు అందక విద్యార్థులు ఆందోళన చెందుతున్నా యూనివర్సిటీ అధికారులు, ప్రభుత్వం పరీక్షలు నిర్వహించి తీరుతామని పేర్కొనడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మహేష్, అర్బన్ మండల అధ్యక్షుడు తుమ్మ గంగాధర్, రాయికల్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, కోఆర్డినేటర్ శ్రీధర్, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, చింతల గంగాధర్, రిజ్వాన్, హరీష్, ప్రణయ్, ప్రతాప్, భగవాన్, సాయి వెంకట్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని సోమన్‌పల్లి ఫీడర్ లో 11 కెవి లైన్ దగ్గర చెట్ల కొమ్మలు తొలగించే పనిలో భాగంగా మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తామని ఏఈ సుందర్ తెలిపారు. హబ్సీపూర్, సోమన్‌పల్లి గ్రామాల్లో గల వినియోగదారులు సహకరించాలని అయన కోరారు.

వైద్యాధికారుల పోస్టుల భర్తీకి 15న ఇంటర్వ్యూలు

జగిత్యాల అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్ట్ బేసిక్ ప్రాతిపదికన బస్తీ దవాఖాన వైద్యాధికారికి సంబంధించిన రెండు పోస్టుల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 15వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఉదయం 10:30గంటల నుంచి 11:30గంటల వరకు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

-ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కోరుట్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, బీడీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాముల కోరారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ అవరణంలో మున్సిపల్ కార్మికులతో కలిసి సంబంధిత వాల్ పోస్టర్‌ను కార్మిక సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుతారి రాములు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు విభాగాలుగా విభజించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తోందని ఆరోపించారు. ఈపీఎఫ్ పథకం క్రింద రిటైర్‌మెంట్ పొందిన కార్మికులకు కనీస పెన్షన్ రూ.9000 అందించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 12 సార్లు జాతీయ కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్నా పటించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మికులకు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌ను కలిసి సమ్మె నోటీసును కార్మిక సంఘ నాయకులతో కలిసి అందించారు.

'పల్లె దవాఖానాలతో ప్రజలకు మెరుగైన వైద్యం'



అయోధ్యలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పల్లె దవాఖానాలతో ప్రజల చెంతకు మెరుగైన వైద్యం అందుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అయోధ్య, అల్లీపూర్ గ్రామాల్లో రూ.20లక్షల చొప్పున నిధులతో నిర్మించిన పల్లె దవాఖానాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె దవాఖానాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాకు 16 మంజూరు కాగా, జగిత్యాల నియోజకవర్గంలో 14 పల్లె దవాఖానాలు మంజూరయ్యాయని అన్నారు. అనంతరం అయోధ్య గ్రామంలో పల్లె దవాఖానాకు స్థలం ఇచ్చిన భూదాతలు ప్రభాకర్ రెడ్డి, శ్రీరంగ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, వినోద్‌రెడ్డిలను ఎమ్మెల్యే సన్మానించారు. అయోధ్యలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్‌లో భాగంగా మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అయోధ్య గ్రామానికి చెందిన ఎడమల పురుషోత్తం రెడ్డికి గుండె శస్త్ర చికిత్స కాగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అల్లీపూర్‌లో ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేను వార్డు ప్రజలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఎంపీడీవో చిరంజీవి, డీఈ మిలింద్, ఎంపీవో సుష్మా, పీఏసీఎస్ చైర్మన్‌లు రాజరెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, రాజలింగం, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, నాయకులు గన్నె రాజరెడ్డి, కోల శ్రీనివాస్, రవీందర్ రావు, గంగ్ర రమాదేవి, అచ్యుత రావు, మాజీ సర్పంచులు జీవన్ రెడ్డి, కొండాల్ రెడ్డి, శారద, మాజీ ఎంపీటీసీ రవీందర్, ఎం.రవీందర్, సురేష్ గౌడ్, తిరుపతి, రాజ శ్రీనివాస్, అత్తినేని రాజన్న, ముఖీద్, ఆర్ఎంపీ వెంకటేష్, రత్నాకర్ రావు పాల్గొన్నారు.

●ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మండలంలోని మూటపెల్లి గ్రామంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కల్యాణంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు -ఇద్దరి మృతి 8

అంజన్న భక్తుల గిరిప్రదక్షిణ 7

సాయిబాబా ఆలయంలో అన్నదానం

కొడిమ్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పౌర్ణమిని పుర్కరించుకొని సోమవారం కరీంనగర్‌కు చెందిన మందపెల్లి రామానుజంసరిత గ్రామస్థులకు అన్నదానం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నహారతి, పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కళాశక్తి సభ్యులు

ఇబ్రహీంపట్నం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం గోధూరు గ్రామంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కళాశక్తి గోధూరు వారి ఆధ్వర్యంలో గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బుద్ధ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, సినీ నటులు గోధూరు మురళి, మాజీ ఎంపీపీ, జగిత్యాల జిల్లా రంగస్థల కళాకారుల సమాఖ్య కన్వీనర్ కోటగిరి వెంకటస్వామి, వీడీసీ అధ్యక్షులు ఎడపల్లి స్వామి, మెట్‌పల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బూరం సంజీవ్, నాయకులు బండి రాజేష్, ఇంద్రాల గంగాధర్,రాజేందర్, బూరం నారాయణ పాల్గొన్నారు.

●గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలోని పలు ఆలయాల్లో పౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాముల పల్లె శ్రీ దుర్గాభవాని, రాపల్లెలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, లొత్తునూర్‌లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం, ఇస్రాజ్ పల్లెలోని త్రికూటాలయంతో పాటు మండల కేంద్రంలోని రామాలయంలో పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. గొల్లపల్లి రామాలయంలో గురిజాల సరిత-బుచ్చిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి'



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, మే12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, లోడును బట్టి నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని సమస్యలను రైతులు, నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కు ముందస్తు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈదురు గాలుల సమయంలో వినియోగదారులకు ఇబ్బందులు కలుగుండా, కోతలు లేని నాణ్యమైన విద్యుత్ అందించడానికి కృషి చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ గంగారం, ఏడీఈ మనోహర్, ఏఈలు జక్కుల అమరేందర్, రవి, అజయ్, వినీత్, సతీష్, సంతోష్, ప్రదీప్, శివకుమార్, మాజీ ఎంపీపీ సాయిరెడ్డి పాల్గొన్నారు.

జగ్గసాగర్‌కు విద్యుత్ సెక్షన్ కేటాయించాలి

మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో విద్యుత్ సెక్షన్ కేటాయించి అధికారిని నియమించాలని యువకులు కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, విద్యుత్ డీఈఈ గంగారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి మండలంలో 23 గ్రామాలు ఉన్నప్పటికీ సెక్షన్ అధికారి ఇన్‌చార్జి ఉన్నాడన్నారు. ఇప్పటికైనా ప్రజలు సమస్యలను గుర్తించి జగ్గసాగర్‌లో సెక్షన్ కేటాయించాలని యువకులు కోరారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డుకు చెందిన సీనియర్ పిల్లల వైద్య నిపుణులు కోటగిరి కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం బాధిత కుటుంబ సభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, రోటరి క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, నాయకులు అడువాల లక్ష్మణ్‌లు పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

ఎండపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట, గుల్లకోట, రాజారాంపల్లి, పాతగూడూర్, గొడిశెలపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక జితెందర్‌రెడ్డి సందర్శించారు. కొనుగోళ్లను ప్రక్రియ వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గొల్ల తిరుపతి, డైరెక్టర్లు, పోలోజు శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, సంజీవ్, సత్య నారాయణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలాండ్‌లో రోడ్డు ప్రమాదం

● మల్యాల యువకుడి దుర్మరణం



మనోజ్‌గౌడ్ (ఫైల్)

మల్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలాండ్ దేశంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్యాల మండల కేంద్రానికి చెందిన పొన్నం మనోజ్‌గౌడ్(29) అనేయువకుడు మృతిచెందాడు. మనోజ్‌గౌడ్ నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకాల నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మనోజ్‌గౌడ్ రెండేళ్ల క్రితం ఉపాధి కోసం పోలాండ్ వెళ్లాడు. సోమవారం ఉదయం రహదారి పక్క నుంచి నడుచుకుంటూ పనికి వెళ్తుండగా వెనుకాల నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మనోజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మనోజ్ మృతితో కుటుంబసభ్యుల్లో విషాదం నెలకొంది.

వ్యాపార భాగస్వాముల వేధింపులతో ఒకరి బలవన్మరణం

కరీంనగర్ క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీ, హైదరాబాద్‌లో భూముల కొనుగోలులో పెట్టుబడి పెట్టిన వ్యక్తికి తోటి భాగస్వాములు డబ్బులు చెల్లించకుండా వేధింపులకు గురి చేయడంతో ఆదివారం రాత్రి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా వెల్గటూర్‌మండలం కిషన్‌రావుపేటకు చెందిన మోకినపల్లి శ్రీనివాస్(38) తీగలగుట్టపల్లిలో నివాసం ఉంటూ ఆటో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. యాదగిరి, భూపతి పాపయ్య, రెడ్డి రాజు, నగునూరు గోపితో కలిసి మృతుడు శ్రీనివాస్ ఇసుకక్వారీలో, హైదరాబాద్‌లోని భూముల్లో పెట్టుబడి పెట్టాడు. శ్రీనివాస్ తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని చాలా కాలంగా భాగస్వాములను అడుగుతున్నప్పటికీ వారు డబ్బులు ఇవ్వకుండా ఆర్థికంగానూ, మానసికంగానూ వేధింపులకు గురి చేశారు. దీంతో ఆవేదనకు గురైన శ్రీనివాస్ ఆదివారం రాత్రి తీగలగుట్టపల్లిలోని అద్దె ఇంటిలో ఉరేసుకున్నాడు. శ్రీనివాస్ భార్య అంజలి ఫిర్యాదుతో నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు, దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై దాడులు

● పలువురు యజమానులకు జరిమానా

మెట్‌పల్లిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై కమిషనర్ టి.మోహన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు, సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్‌ను వాడుతున్న వారికి1500 రూపాయల జరిమానావిధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ మాట్లాడుతూ జ్యూటుబ్యాగులు మాత్రమేవాడాలని సూచించారు. దుకాణ దారులందరూ ట్రేడ్‌లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని లేకపోతే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, మున్సిపల్ సిబ్బంది ముజీబ్, పున్నం నాయక్, ప్రశాంత్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం పట్టాలెక్కేనా?

● అభివృద్ధికి దూరంగా నాంపల్లి గుట్ట

● రూ. 30 కోట్ల పనులు ప్రతిపాదనలకే పరిమితం



వేములవాడ కల్చరల్, మే 12: వేములవాడ మండలంలోని నాంపల్లి గుట్ట ప్రకృతి అందాలకు నిలయం. చుట్టూ పచ్చదనంతో ఎంతగానో ఆకర్షిస్తూ.. గుట్ట మధ్య ఐదు తలల సర్పాకారంలో గుట్టపై నిర్మించిన కాళీయమర్ధనం, తలపై శ్రీకృష్ణుడి నృత్యరూపం, చుట్టూ పచ్చని పంటపొలాలు, ఓ వైపు మూలవాగు అందాలు, మరో వైపు మానేరువాగు అందాలు, ఎదురుగా మధ్యమానేరు డ్యామ్ బ్యాక్ వాటర్ చూపరులను కట్టిపడేస్తాయి. ఆరువందల సంవత్సరాల క్రితమే నాంపల్లి గుట్టపైన మూడు నామాల రూపంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రతిమ కుడివైపున హనుమంతుడి ప్రతిమ వెలిసినట్లు, చోళుల కాలంలోనే స్వామి వారికి పూజలు జరిగినట్లు ఆధారాలు చెబుతున్నాయి. మహిమాన్వితంగా వెలుగొందుతున్న లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఉన్న నాంపల్లి గుట్ట పర్యాటకంగా అభివృద్ధి దూరంగా ఉన్నది. 2015వ సంవత్సరంలో అప్పటి సీఎం కేసీఆర్ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చిన సందర్భంగా నాంపల్లి గుట్టను సందర్శించారు. గుట్టను పరిశీలించి అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లోనే రూ. 28 నుంచి రూ. 30 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధ చేసి చిత్రాలను సైతం విడుదల చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాంపల్లి గుట్ట పర్యాటకాభివృద్ధికి నోచుకోలేదు.

● నిరాదరణకు గురువుతన్న గుహలు, శిలలు

నాంపల్లి గుట్టపైన రెండు ధర్మగుండాలు ఉన్నాయి. గుట్ట బండరాళ్లలో వున్న ధర్మగుండం సుమారు వెయ్యి యేళ్ల క్రితం శ్రీరాజరాజేంద్రుడు కట్టించినట్లు స్థానికులు చెబుతున్నారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి తడిబట్టతో శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకునేవారు. నాంపల్లి గుట్టపైన గోపురం పక్కన సహజసిద్ధంగా ఏర్పడిన బండరాళ్ల మధ్య ఒక శివలింగంతో పాటు పలు విగ్రహాలు ఉన్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురవుతున్నాయి. క్రీ.శ 10వ శతాబ్దంలో నవనాథ సిద్దులు (తొమ్మిది మంది) ఈ గుట్టపై తపస్సు చేసి సిద్ధి పొందారని, ప్రతినిత్యం నవనాథ సిద్ధ మహర్షులు ఈ గుహలో నుంచి భూగర్భ మార్గంలో వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని చేరుకుని పూజలు చేసేవారని నానుడి. అలాంటి గుహలు నిరాదరణకు గురువుతున్నాయి. అంతే కాకుండా నాంపల్లి గుట్ట చుట్టూ ఎన్నో విశిష్టతలు ఉన్నాయి అందులో 12వ శతాబ్దం సంబంధించిన జైన మతానికి చెందిన పార్శ్వనాథుని ప్రతిమ బండరాయికి కనిపిస్తుంది. ఇలాంటి ప్రతిమలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అంతే కాకుండా గుట్టకు నాలుగు వైపులా పెద్ద పెద్ద బండరాళ్లకు హనుమంతుని ప్రతిమలు కనిపిస్తాయి.

● కట్టిపడేసే కాళీయమర్ధనం

నాంపల్లి గుట్టపైకి వెళ్లే మార్గంలో మధ్య భాగాన 2003 సంవత్సరంలో చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి కేంద్రసహాయ మంత్రిగా ఉన్నప్పుడు ఐదు తలల సర్పాకారంలో వున్న కాళీయమర్ధనాన్ని నిర్మించారు. సుమారు సంవత్సరం పాటు కాళీయ మర్ధనం నిర్మాణ పనులు చేపట్టారు. పాముపైన శ్రీకృష్ణుడు నృత్యం చేస్తున్నట్లు వెనుకభాగంలో పచ్చటి పంటపొలాలతో ఎంతో ఆకర్షనీయంగా చూపరులను కట్టిపడేస్తుంది. కాళీయమర్ధనం లోపలికి వెళ్లే మార్గంలో శ్రీకృష్ణుడి లీలకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాళీయమర్ధనం లోపల ఉగ్రనృసింహస్వామి విగ్రహంతో పాటు నాగదేవత విగ్రహాలు ఉన్నాయి. భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకుని నాగ దేవతకు పాలతో అభిషేకం నిర్వహిస్తారు.



నాంపల్లి గుట్టపై రోప్ వే ఊహా చిత్రం

● ప్రచారానికే పరిమితమైన అభివృద్ధి

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధిలో భాగంగా నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి గుట్ట అభివృద్ధి జరుగుతుందని జోరుగా ప్రచారం జరిగింది నాంపల్లి గుట్ట సుమారుగా 52 అడుగుల ఎత్తుతో కొంతభాగం నిటారుగా ఉండ టంతో గుట్టపైన కొలువుదీరిన స్వామి వారిని వృద్దులు, వికలాంగులు దర్శించుకునేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో నాంపల్లి గుట్టపైకి వెళ్లేందుకు వీలుగా రోప్‌వే నిర్మాణం చేపట్టాలని, నాంపల్లి గుట్టపైకి వెళ్లేందుకు ఒక్కటే ఘాట్ రోడ్డు ఉండటంతో ప్రొటెక్షన్ వాల్‌తో మరో ఘాట్ రోడ్డు నిర్మాణం, గుట్టపైన ఉన్న రెండు ధర్మగుండాలను ఆహ్లాదకరంగా సుందరీకరణకు, గుట్టపైకి వచ్చే భక్తులను ఆకట్టుకునేలా వసతిగృహాల నిర్మాణం, గుట్టపైన ఆహ్లాదకరమైన వాతావరణంలో ధ్యానమందిరం నిర్మాణం, ప్లానిటోరియం, గుట్ట చుట్టూ వున్న ప్రకృతి అందాలను భక్తులు వీక్షించేందుకు గుట్టపైన పనోరమా వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసేందుకు ఊహాచిత్రాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు అధికారులు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో మందడుగు పడటంతో భక్తులు నాంపల్లి గుట్ట కూడా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టిసారించాలని కోరుతున్నారు.

గోనె సంచులు ఇవ్వడంలో నిర్లక్ష్యం

● పురుగుల మందు డబ్బాతో రైతు నిరసన

పెద్దపల్లి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్ని సంచులు ఇవ్వకపోవడంపై చొప్పరి కనుకయ్య అనే రైతు ఆదివారం సాయంత్రం పురుగుల మందుతో ఆత్మహత్యయత్నానికి పాల్పడేందుకు యత్నించాడు. కనుకయ్య 25రోజుల క్రితం కేంద్రంలో ధాన్యాన్ని ఆరబోశాడు. పలుమార్లు అడిగినా గన్ని సంచులు ఇవ్వలేదు. పది రోజుల క్రితం కేంద్రంలో పోసిన ధాన్యానికి గన్ని సంచులు ఇవ్వడంతో కనుకయ్య నిర్వాహకులను నిలదీశారు. కొనుగోలు కేంద్రంలో క్రమపద్ధతి పాటించడం లేదని, అందరిని సమానంగా చూస్తూ కొనుగోలు చేయాలని సూచించినా నిర్వాహకులు పట్టించుకోలేదు. దీంతో ఓ వైపు వర్షాలు, మరోపక్క ఎండతీవ్రత, కేంద్రం నిర్వాహకుల వైఖరిని నిరసిస్తూ కనుకయ్య ఆవేదనకు గురై పురుగుల మందు తాగేందుకు సిద్ధపడగా అక్కడే ఉన్న రైతులు అడ్డుకున్నారు. ఇంత జరిగినా నిర్వాహకులు గన్ని సంచులు ఇవ్వలేదని రైతు చొప్పరి కనుకయ్య పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు

● పది నిమిషాల్లో డాక్యుమెంట్ అందజేత

● ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్



డాక్యుమెంటు అందజేస్తున్న రిజిస్ట్రార్

పెద్దపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): స్లాట్‌బుక్ చేసుకున్న తరువాత కేటాయించిన తేదీలో కార్యాలయానికి వస్తే కేవలం పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తోపాటు మ్యూటేషన్ అందించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లారిజిస్ట్రార్ బీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌సేవలు పైలట్‌ప్రాజెక్టు కింద ఎంపికైంది. సోమవారం ఆన్‌లైన్‌సేవలు ప్రారంభించిన అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మొదటి విడుతలో పైలెట్ ప్రాజెక్టు కింద 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎంపికయ్యాయని అందులో జగిత్యాల, రామగుండం ఉన్నాయని, రెండోవిడుతలో పెద్దపల్లి ఉందన్నారు. జూన్2న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. గతంలో స్లాట్‌బుక్ చేసుకున్న తరువాత రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు సుమారు వారంరోజులు సమయం పట్టేదన్నారు. ప్రస్తుతం పదినిమిషాల్లో ఇస్తామన్నారు. ఈ విధానం ద్వారా రోజుకు 48రిజిస్ట్రేషన్లు చేయ వచ్చన్నారు. దీంతో కార్యాలయం చుట్టు తిరగాల్సిన అవసరం లేదని, అలాగే ఎక్కువ సమయం నిరీక్షించవల్సిన పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభించగానే ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన గడ్డం ఈశ్వరమ్మకు డాక్యుమెంట్‌ను అందజేశారు. అశోక్, పారుపెల్లి వేణు తదితరులున్నారు.

రేణుక ఎల్లమ్మకు జలాభిషేకం

వీణవంక, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో గౌడకులస్థులు రేణుక ఎల్లమ్మకు జలాభిషేకం చేశారు. నీటిబిందెలను నెత్తినపెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడసంఘం మహిళలు ప్రతిఇంటి నుంచి కుటుంబసభ్యులతో కలిసి ఊరేగింపుగా కదిలారు. గీతకార్మికులందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.



వల్భాపూర్‌లో బిందెలతో ఎల్లమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

చొప్పదండిలో హార్వెస్టర్ దగ్ధం

చొప్పదండి, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. హార్వెస్టర్‌కు మంటలు అంటుకోగా సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ.5లక్షల వరకు నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



తిరుపతి రావు (ఫైల్)

తిమ్మాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): చేతికి వచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా తట్టుకోలేని తండ్రి ఆదివారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన సిరికొండ తిరుపతి రావు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతని కుమారుడు సిరికొండ నిఖిల్‌రావు(22) హైదరాబాద్‌లో ఉంటూ బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతూ ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. అందులో డబ్బులు పోగొట్టుకొని మనస్తాపానికి గురై గత మార్చి10న గ్రామశివారులోని వారి వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతిరావు కుమారుడు లేని లోటు జీర్ణించుకోలేకపోయాడు. ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావివద్ద (కుమారుడు పడిన బావి) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తిరుపతిరావు తన భార్య శ్యామలకు ఫోన్‌చేసి తెలిపాడు. వెంటనే ఆమె స్థానికులకు తెలుపగా వారు తిరుపతిరావును కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తిరుపతిరావు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైనచికిత్స కోసం హైదారాబాద్ తరలించారు. హైదారాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తిరుపతిరావు మృతిచెందాడు. రెండునెలల్లో కుమారుడు, తండ్రి మృతిచెంద డంతో తిరుపతిరావు భార్య శ్యామల ఒంటరైంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

అంతర్గాం, మే 12 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని బుగ్గ రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కమాన్‌పూర్, భూపాలపల్లి ఏరియాకు చెందిన సాయి ప్రదీప్, యశ్వంత్, శివ, కమల్‌లు ఒడిశా రాష్ట్రం నుంచి రెండు బైక్‌లపై 15కిలోలు సుమారు రూ.8లక్షల విలువ గల గంజాయిని తరలిస్తున్నారు. విశ్వసనీయవర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ వెంకటస్వామి బుగ్గగుట్ట వద్ద వల పన్ని పట్టుకున్నారు. నిందితుల వద్ద ఉన్న బ్యాగుల తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. సోమవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. గంజాయితో పట్టుబడిన నిందితులను గోదావరిఖని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐతోపాటు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ అక్కపాక రవీందర్, మల్లేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

జగిత్యాల అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ ఆంధ్రప్రదేశ్‌లోని కొండారెడ్డిపల్లెకు చెందిన మాచనూరు కొండయ్య(22) జైలుశిక్ష పడినట్లు ట్రాఫిక్‌ఎస్సై మల్లేష్ తెలిపారు. జిల్లాకేంద్రంలో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలునిర్వహిస్తున్న సమయంలో పట్టుబడగా, కేసునమోదుచేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. న్యాయమూర్తి కరుణాకర్ కొండయ్యకు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

చంపుతామని బెదిరించిన ఐదుగురికి రెండేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి చంపుతామని బెదిరించిన కేసులో సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన ఎర్ర మల్లేశం, ఎర్ర రాజవ్వ, ఎర్ర సుజాత, ఎడవల్లి మల్లవ్వ, జింక దేవవ్వలకు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 6వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయ మూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారని టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన అరుణ తన ఇంటి వద్ద లేనిది చూసి ఇంటి వెనుక ప్రహరీ గోడను ఎర్ర మల్లేశం, రాజవ్వ, సుజాత, మల్లవ్వ, దేవవ్వలు కలిసి కూలగొట్టారు. ఈ విషయాన్ని పక్కనే ఉన్న పోచవ్వ వెళ్లి అరుణకు చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన ఐదుగురు వ్యక్తులు కలిసి తిట్టుకుంటూ గడ్డపారతో పొడిచి గాయపరిచేందుకు ప్రయత్నించారు. ఈ దాడిని చూసిన నర్మెట్ట రమేశ్, రగుడు లక్ష్మన్ వెళ్లి పోచవ్వ, అరుణలను కాపాడారు. అయినప్పటికీ మిమ్మల్ని ఎప్పటికైనా చంపుతామని ఐదుగురు వ్యక్తులు బెదిరించారని సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు అరుణ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ అనంతరం చార్జీషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ అధికారి శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ 11మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పిపి సందీప్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణిన్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 6వేల జరిమానా విధించారని సీఐ తెలిపారు.

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడి



కొలనూర్‌లో నాటుసారా తయారీ సామాగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఓదెల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో ఆదివారం రాత్రి నాటుసారా తయారీకేంద్రాలపై పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలు కొనసాగిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నాటుసారా తయారు చేసి విక్రయానికి పాల్పడుతున్న గండికోట కనుకయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఏఎస్‌ఐ రత్నాకర్, పోలీస్ సిబ్బంది రాజు, రాజేందర్, అశోక్ పాల్గొన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, మే 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. వెంకటయ్యపల్లి గ్రామ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మూడుట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామసమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం దాడిచేయగా డ్రైవర్‌బెజ్జంకి తిరుపతి పరారయ్యాడు. ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

వైద్య, ఆరోగ్య రంగంలో ప్రైవేటీకరణను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

భగత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య రంగంలో ప్రైవేటీకరణను నిలిపివేయాలని ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. సోమవారం నగరంలోని ముకుంద లాల్ మిశ్రాభవన్‌లో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు లేబర్‌కోడ్స్ తీసుకురావడం సమ్మెహక్కు, ఉద్యోగ, సామాజిక భద్రత కాలరాయడమేనన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీ కరణ విధానాలు అమలు చేస్తోందన్నారు. మే20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కేంద్రప్రభుత్వంపై తిరుగుబాటు మొదలు పెట్టాలన్నారు. లేబర్‌కోడ్స్ రద్దుకోసం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించాలని, రైతులను, కూలీలను కలుపుకొని పెద్దఎత్తున సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి మారెళ్ల శ్రీలత, నాయకులు పద్మ, లక్ష్మి, రజిత, పరిమిత, సత్యలక్ష్మి, ప్రియాంక, సరిత, లత పాల్గొన్నారు.

కోడెల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి



రాజన్న ఆలయ గోశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర ఎండల నేపథ్యంలో రాజన్న ఆలయ కోడెల సంరక్షణపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లాకలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. తిప్పాపూర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోవులకు అందిస్తున్న మేత, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, సౌకర్యాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. వాటి సంఖ్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ కోడెలకు వేసిన జియో ట్యాగులను పరిశీలించారు. ప్రతి గోవుకు జియో ట్యాగింగ్‌తో కూడిన పరికరాన్ని పెట్టాల న్నారు. తద్వారా కోడెల పంపిణీ అనంతరం వాటియొక్క లోకేషన్ ట్రాకింగ్ చేయవచ్చన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున గోశాల షెడ్లలో నీటి తుంపర్ల యంత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. షెడ్లలో నిలువ చేసిన గడ్డిని తరలించి కోడెలకు మేతకు ఉపయోగించాలన్నారు. కోడెలకు సరిపడా పచ్చిగడ్డి అందుబాటులో ఉంచాలన్నారు.

ఎండాకాలం నేపథ్యంలో గోవుల సంరక్ష ణను మరింత బాధ్యతగా చూసుకోవాలని గోశాల సిబ్బందికి సూచించారు. కోడెలకు నిత్యం అందించే దాణా, మేత, తాగునీరు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కోడెల వైద్యం టీకాలు, ఇతర అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కోడెల వయసు ఆధారంగా వాటిని వివిధ షెడ్‌లలో పెట్టాలన్నారు. అనంతరం పశువైద్యాధి కారులు గోవులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఆలయ ఏఈవో శ్రీనివాస్, గోశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

24 నుంచి 'తానాకాన్' రాష్ట్ర సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న తానాకాన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ శ్రీనివాస్

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల24,25 తేదీల్లో తానాకాన్ పేరిట రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ శ్రీధర్, ఆర్గనైజింగ్ ఫైనాన్స్ సెక్రెటరీ డాక్టర్ బండారి అరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని ఐఎంఎ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25వ తేదీల్లో నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించనున్న సదస్సులో 24న సీఎంఈ(కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 25న చిన్న, మధ్యతరహా హస్పిటల్స్, నర్సింగ్‌హోమ్స్ ఎదుర్కొంటున్న సమస్యలైన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, హాస్పిటల్స్ పర్మిషన్(న్యూ, రినివల్స్), పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ట్రేడ్ లైసెన్స్ ఎస్‌టీపీ, ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లపై దాడులు తదితర సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 మందికి పైగా వైద్యులు హాజరతారని తెలిపారు. సమావేశంలో ఐఎంఎ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్, ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, తానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ రవికాంత్, డాక్టర్ మహేశ్, డాక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి బోధనలు విశ్వమానవాళికి ఆచరణీయం



వడుకాపూర్ గ్రామశివారులో బుద్ధుడికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

జూలపల్లి/ఎలిగేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడి బోధనలు విశ్వమానవాళికి ఆచరణనీయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. వడుకాపూర్ గ్రామపరిధిలోగల అతిప్రాచీన బౌద్ధస్తూపం వద్ద సోమవారం బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని జూలపల్లి, ఎలిగేడు మండలాల దళిత సంఘాల నాయకులు, బౌద్ధిస్టులు గౌతమ బుద్ధుడి జయంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విజయరమణారావు బుద్ధుడివిగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మానవజాతికి సహనాన్ని, ప్రేమతత్వాన్ని, అహింసను, శాంతిని పంచిన బుద్ధుడి బోధనలు అందరికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే పంచశీల జెండాను ఆవిష్కరించారు. బుద్ధ క్షేత్రానికి రావడానికి రహదారి సరిగా లేదని, తారురోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ దేవా శ్రీనివాస్ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేహదానం అవయవదాన పత్రాన్ని అందించారు. ఎస్ఐ సనత్‌కుమార్, విశ్రాంత సబ్‌ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య కాంబ్లే, దేవ శ్రీనివాస్, పర్శరాములుగౌడ్, మొగురం రమేష్, పాటకుల భూమయ్య, పలువురు నాయకులు బౌద్ధిస్టులు, పాల్గొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఎంఏ (ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ, ఎకనామిక్స్ సోషియాలజీ), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ (వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, గణాంకాలు, మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్, న్యూట్రిషన్ డైటెటిక్స్, కంప్యూటర్ సైన్స్ డేటా సైన్స్, ఎంకామ్ (జనరల్, ఎఫ్ఏ, సీఏపీ, ఇన్సూరెన్స్), ఎంబీఏ. 1,3వసెమిస్టర్ జనవరి/ఫిబ్రవరి 2025పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారిడాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ww.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండో, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు బుధవారం నుంచి యథావిధిగా ప్రారంభమవుతాయని, వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్స్ పొందుపరిచామని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. కళాశాలలు డౌన్ లోడ్ చేసుకొని విద్యార్థులకు జారీ చేయాలని సూచించారు. పరీక్షలు వాయిదా అంటూ సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని తెలిపారు.



కాళేశ్వరం గోదావరి వద్ద ఏర్పాటు చేసిన ఆకృతి

చల్లగ చూడు సరస్వతీ మాత

15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు

- కాళేశ్వరంలో ప్రత్యేక ఏర్పాట్లు...
- రేపు రాత్రి 10-35 గంటలకు పుష్కర ముహూర్తం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత దేశం ఎన్నో పుణ్య నదులున్నాయి. గురువు ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు ఆయా నదికి పుష్కరాలు వస్తాయి. పుష్కరం అంటే జలమని పేరు. మామూలు నదీ స్నానం కంటే పుష్కర స్నానం అనేక రెట్ల పుణ్య ఫలాన్ని, సకల శుభాలను, మోక్షాన్ని ఇస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. సరస్వతీ నది ప్రస్తావన ఋగ్వేదంలో ఉంది. ఈ నది ఎవరికీ కనపడదు. హిమాలయాలలోని శివాలిక్ పర్వత పంక్తుల్లోని ప్లక్షప్రస్రవణగిరిపై పుట్టింది. సరస్వతీ నదీ ప్రస్తావన పద్మ, బ్రహ్మవైవర్త పురాణాల్లోనూ ఉంది. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు రానున్న సందర్భంలో 'ఆంధ్రజ్యోతి' కథనం...

ఇదే పుష్కర సమయ ముహూర్తం...

ఈ నెల 14వ తేదీ రాత్రి 10-35 గంటలకు బృహస్పతి మిథున రాశిలో ప్రవేశించడంతో సరస్వతీ నది పుష్కరాలు ప్రారంభం కానున్నట్లు కాళేశ్వర ఆలయం అర్చకులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

సరస్వతీ నది ఎక్కడెక్కడ ఉంది?

తొలుత భూమిపై ఉత్తరాఖండ్, చమేలీ జిల్లా బదరీనాథ్ సమీపంలో మానా గ్రామంలో మాత్రమే సరస్వతీ నది కనిపిస్తోంది. ఇదే మొదటి నది. ఈ నదిని అక్కడ ప్రత్యక్షంగా చూడవచ్చు. పాండవులు స్వర్గారోహణం చేసే ముందు మానా గ్రామానికి వచ్చినప్పుడు ఈ నదిని దాటాల్సి వచ్చింది. అప్పుడు భీముడు రెండు కొండల మీద మరో కొండ నిలిపి వంతెనలా ఏర్పాటు చేశాడు. అందుకే దాన్ని భీమ్‌పూర్, భీమ్ వారధి అంటారు. ఇక రెండోది పంచ సరోవరాల్లో ఒకటైన పుష్కర్ సరోవరంలో కనిపిస్తుంది. ఇది రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో ఆరావళి కొండల మధ్యఉంది. అజ్మీర్‌కు 14 కిలోమీటర్ల దూరంలో బ్రహ్మదేవుడి ఆలయం కూడా ఉంది. పద్మపురాణం ప్రకారం వజ్రనాభుడు అనే రాక్షసున్ని బ్రహ్మ తన చేతిలోని తామర పువ్వు విసిరి సంహరిస్తాడు. ఆ పువ్వులోని 3 రేకులు భూమిపై పడి జేష్ఠ, మధ్య, కనిష్ఠ పుష్కర సరస్సులుగా మారి సరస్వతీ నది ద్వారానే ఏర్పడినాయని తెలుస్తోంది. మూడోది గంగా, యమునా నదులతో పాటు సరస్వతి అంతర్వాహినిగా ప్రవహించే ప్రయాగరాజ్ క్షేత్రం. ప్రయాగకు అమృత తీర్థమని, భాస్కర తీర్థమనే పేర్లు వచ్చాయి. నాలుగోది గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్ధాపూర్‌లో ఉన్నది. ఐదోది తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా, కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహితలతో పాటు సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల పుష్కరిణిలో కూడా సరస్వతి అంతర్లీనంగా ఉందని చెబుతారు. ఇది ఆరోది. ఈ ప్రదేశాల్లో పుష్కర రోజుల్లో స్నానం చేయవచ్చు.

హెలీకాప్టర్‌తో జాయ్‌రైడ్

పుష్కరాల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం హెలీకాప్టర్ ద్వారా పుష్కరాలను వీక్షించేందుకు జాయ్ రైడ్‌ను అందుబాటులోకి తీసుకరానున్నారు. ఒక్కరికి 4,500 టికెట్ చొప్పున తీసుకొని 6 నుంచి 7 నిముషాల పాటు హెలీకాప్టర్‌లో పుష్కరాలను, కాళేశ్వర అడవుల అందాలను వీక్షించవచ్చు. టికెట్ల బుకింగ్ కోసం టోల్‌ఫ్రీ నంబరును త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిసింది.

పుష్కరాలకు ప్రత్యేక ఏర్పాట్లు...



కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దేవాదాయశాఖ అధికారులతో కలసి ప్రత్యేక ప్రణాళికను రూపొందిచారు. ప్రభుత్వం 35 కోట్లు విడుదల చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులను ఆహ్వానిస్తున్నట్లు, 12 రోజుల పాటు నదీ హారతి ఉంటుందని మంత్రులు తెలిపారు. పుష్కరాలకు ప్రతీ రోజూ లక్ష మంది వస్తారని అంచనా వేస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పుష్కర ఘాట్‌లు, మంచినీటికి, వసతికి, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రులు చెప్పారు.



పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్లు

పుష్కర స్నానం ఎలా చేయాలి?

స్నానానికి ముందు సరస్వతీ నదిని అర్చించి, స్నానం చేయాలి. దంపతులు కొంగులు ముడి వేసుకొని మూడు సార్లు మునిగి సరిగంగ స్నానం చేయాలి. నదీ స్నానం ఎక్కడ, ఎప్పుడు చేసినా ముందు పిడికెడు మట్టిని ఒడ్డు నుంచి తీసుకొని కృత్య అనే శక్తిని స్మరించి నదిలో వేయాలి. ఆ పై సంకల్పం చెప్పుకొని స్నానం చేయాలి. 12 రోజులు 12 రకాల దానాలు ఆచరించాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

కలెక్టరేట్ ఎదుట దళితబంధు లబ్ధిదారుల ధర్నా

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): దళితబంధు నిధులపై విధించిన ఫ్రీజింగ్‌ను ఎత్తివేసి గ్రౌండింగ్ చేయాలని కోరుతూ దళితబంధు లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హుజూరా బాద్ నియోజకవర్గానికి చెందిన 60మందికిపైగా రెండోవిడత లబ్ధిదారులకు సంబంధించిన ఫ్రీజింగ్ ఎత్తివేయాలన్నారు. గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. దళితుల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఖాతాలో నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

అంతకుముందు ఎస్సీ కార్పొరేషన్ సీఎండీ జనవరి 28న నిధులు విడుదల చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల జిరాక్స్‌లను చూపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండవ విడత దళితబంధు లబ్ధిదారులు

పౌర రక్షణ వలంటీర్ల నమోదుకు ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మై భారత్ యువతను పౌరరక్షణ వాలంటీర్లుగా నమోదు చేసుకోవాలని ఆహ్వానిస్తున్నట్లు మైభారత్ నెహ్రూ యువ కేంద్ర, జిల్లాయువజన అధికారి వెంకట రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, మై భారత్ దేశవ్యాప్తంగా యువతను భారత్‌పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. దేశానికి సేవ చేయాలనుకునే ఇందులో చేరడానికి ఆహ్వానం పలుకుతున్న పేర్కొన్నారు. వివరాలకు https://mybharat.gov.in, మై భారత్ నెహ్రూ యువ కేంద్రం, కరీంనగర్ జిల్లా, నంబర్లలో 9177329258, 0878-2243604 సంప్రదించాలని సూచించారు.

అంజన్న భక్తుల గిరిప్రదక్షిణ



కొండగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మల్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు ఆంజనేయస్వామి గిరులచుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణను సోమవారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో 28వ సారి నిర్వహించిన ఈ గిరిప్రదిక్షణ నూతనంగా ఏర్పాటు చేసిన మార్గంలో సుమారు ఆరు కి.మీల మేర సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

19 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షల ప్రణాళిక విడుదల చేశారు. ఈ నెల 19నుంచి 30వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. 2019 బ్యాచ్ బ్యాక్లాగ్ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించినట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోగానీ, ఆయా కళాశాలల్లోగానీ సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ పార్సిల్స్ వేలం

భగత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్ లాజిస్టిక్స్ కౌంటర్‌లో 40 రోజుల పైబడిన పార్శిళ్లను వేలం వేయనున్నట్లు కరీంనగర్ లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 11 గంటలకు కరీంనగర్ బస్టాండ్ కౌంటర్‌లో వేలం ఉంటుందని పేర్కొన్నారు.

జేఎన్టీయూలో ప్రశాంతంగా ఈసెట్



పరీక్ష హాల్‌లోకి వెళుతున్న అభ్యర్థులు

రామగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఈసెట్ పరీక్షలు సోమవారం మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసాయి. ఆన్‌లైన్ పద్ధతిలో ఉదయం జరిగిన పరీక్షలో 100 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మామిడికాయ పచ్చడి సందడి

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మామిడికాయ పచ్చడి సందడి నెలకొంది. పచ్చడికి అనువైన మాసాలు ఏప్రిల్, మే కాగా మే నెలలో తయారీకి ప్రాధాన్యమిస్తారు. కాయల నాణ్యత, పచ్చడి పెట్టే విధానాన్ని బట్టి రెండు సంవత్సరాల వరకూ నిలువ ఉంటుంది. అందుకే మామిడి పచ్చడిని ఏడాది గ్రాసంగా అభివర్ణిస్తారు. వేడి అన్నంలో పచ్చడి, నూనె లేదా నెయ్యి కలుపుకొని తింటే స్వర్గం కనిపిస్తోందని పచ్చడి ప్రియులు పేర్కొంటారు. గాలి వానలకు కాయలు రాలక ముందే కాయలు, వస్తువులు కొనుగోలు చేస్తూ పచ్చడి తయారీలో నిమగ్నమవుతున్నారు.



మామిడి కాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

చుక్కలను చూపుతున్న ధరలు

మామిడికాయల ధరలు...

మార్కెట్‌లో కాయలు రైతులు రాసులుగా పోశారు. పుల్లటి కాయకు గిరాకీ ఉండగా ఒక్కో కాయ సైజును బట్టి 6 నుంచి 15 రూపాయల వరకు అమ్ముతున్నారు. కాయ ఎంపికలో జాగ్రత్తపడక సోతే తొక్కు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. గ్రామాల నుంచి మార్కెట్‌కు వచ్చిన పలువురు కాయలను కొడుతూ ఉపాధి పొందుతున్నారు. నీళ్లలో వేసి తుడిచి కొట్టేందుకు కాయకు ఐదు నుంచి ఎనిమిది రూపాయల వరకు తీసుకుంటున్నారు.

ముడి వస్తువుల ధరలు

పచ్చడికి అవసరమైన వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. రిఫైండ్ ఆయిల్ ప్యాకెట్ 160, పల్లి నూనె ప్యాకెట్ 150, ఆవాలు, మెంతులు కిలోకి100, జీలకర్ర కిలో 300, శనగలు కిలో 80, ఉప్పు కిలో 20, కారం 250, ఇంగువ 50 రూపాయల వరకు పలుకుతున్నాయి.

పచ్చడి తయారీ ఇలా...

బాణలో నూనెపోసి ఆవాలు, జీలకర్ర, మెంతులు (అలవాట్లను బట్టి అల్లం వెల్లుల్లి)వేసి పోపు పెట్టాలి. తగినంతగా కారం, ఉప్పు వేసి చల్లార్చుకోవాలి. తర్వాత మామిడి ముక్కలను కలపాలి. పోణిలో ఇంగువను వాడవచ్చు. పల్లీలు, జీడిని కూడా వేస్తారు. ఉప్పు ఆవకాయ పెట్టేవారు ఆవపొడి, పసుపు, ఉప్పు వేసి కలిపి పెట్టి ఒక రోజు తర్వాత పోపు పెట్టాలి. ముక్కలతో పాటు పోపు పెట్టిన కారాన్ని కల్పి జాడీలలోకి ఎత్తుకుంటే రెండు రోజుల తర్వాత ఊరుతుంది. పచ్చడి ఎంత ఊరితే అంత రుచి వస్తోంది.



మామిడికాయలను ముక్కలుగా కొడుతున్న మహిళ



ముగిసిన బ్రహ్మోత్సవాలు

జగిత్యాల అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక శ్రీసూర్య ధన్వంతరి దేవాలయంలో నిర్వహిస్తున్న సప్తమ బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసినట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు పాల్తెపు శంకర్ అరుణ, గంగాధర్ విజయ, వొడ్నాల శ్రీనివాస్, వడ్లగట్ల శంకర్, భారతాల రాజసాగర్, ఆలయ అర్చకులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

రాయికల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమవారం సీఎం ఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2,09,500ల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పెగడపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : 18 సంవత్సరాల నుండి 60 ఏండ్ల లోపు మహిళలందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని పెగడపల్లి ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి ఉల్లాస్ పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉల్లాస్ ముఖ్య ఉద్దేశ్యం 18 నుండి 60 ఏండ్ల లోపు నిరక్షరాస్యులైన మహిళలందరిని గుర్తించి, వారిని 10 మందికి ఒక బ్యాచ్‌గా విభజించాలన్నారు. 10వ తరగతి చదివిన వాలంటీర్లను ఎంపిక చేసుకుని 100 రోజులలో నిరక్షరాస్యులందరికి ప్రాథమిక విద్య అనగా చదవడం రాయడం నేర్పించాలన్నారు. సమావేశంలో ఎంపీవో మహేందర్, ఎంఈఓ సులోచన, ఏపీఎం సమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే, 12 (ఆంధ్రజ్యోతి) :మేడిపల్లి గ్రామ శివారులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణాన్ని సోమవారం వైభవంగా జరిపించారు. ఆలయంలోని ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, కలశపూజ తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ, నాయకులు, గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కళ్యాణ వేడుకలు ఆలయ అర్చకుడు తిరునగరి వెంకట గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రామకృష్ణ, శ్రీధర్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ యాచమనేని మహేశ్వర్ రావు, గుర్రం మహేందర్ గౌడ్, జాతర నిర్వాహకులు నూకల గంగాధర్, బోగ రాజశేఖర్, వంశీ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

-కలెక్టర్ సత్యప్రసాద్ - ప్రజావాణిలో 30 దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై వివిధ సమస్యలపై ప్రజల నుంచి 30 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకొని సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓలు మధుసూదన్, శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, వీల్ చైర్ లేక ఇబ్బందులు పడుతూ ప్రజావాణికి వస్తున్న దివ్యాంగుడు

దివ్యాంగుడి గోస..

ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సత్య ప్రసాద్‌ను కలిసి సమస్యను విన్నవించుకోవడానికి వచ్చిన ఓ దివ్యాంగుడు వీల్ చైర్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. వాహనాల పార్కింగ్ స్థలం నుంచి నేలపై నెట్టుకుంటూ వస్తూ ఇక్కట్లను ఎదుర్కొన్నాడు.

కొండగట్టులో వసతులు కల్పించండి..

మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కోరుతూ కొడిమ్యాల గ్రామానికి చెందిన ఉప్పు చంద్రశేఖర్ వినతిపత్రం అందించాడు. పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, వసతిగృహాలు, బేబీ ఫీడింగ్ కేంద్రం, సెంటర్ ఆసుపత్రి, ఏటీఎం తదితర సౌకర్యాలు కల్పించాలని కోరాడు. దుకాణాలు దక్కించుకున్న టెండరుదారులు దేవాదాయ శాఖ నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశాడు.గుట్టపై సెక్యూరిటీ గేటు వద్ద ఉండే హోంగార్డు నిత్యం రాకపోకలు సాగించే వాహనదారుల నుంచి డబ్బులను వసూలు చేస్తున్నారన్నాడు. కొబ్బరికాయ కొట్టు స్థలం, కల్యాణ కట్ట, వాహన పూజ వద్ద సైతం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెగడపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో సోమవారం స్వామి కళ్యాణోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం ఉదయం నుండే అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భక్తుల దర్శనాలు చేసుకోగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు గుండి శ్రీనివాస్ శర్మ, వినయ్ శర్మల వేద మంత్రాల మధ్యన స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికే చెందిన గంగుల కొమురెల్లి కుటుంబ సభ్యులు కళ్యాణోత్సవాలకు విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, కమిటీ సభ్యులు, లలిత పారాయణం గ్రూప్ మహిళా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రూ.18 కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణం

-జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి నుంచి గాంధీనగర్ మీదుగా చల్‌గల్ వరకు రూ.18 కోట్లతో బ్లాక్ స్పాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీనగర్ వద్ద జాతీయ రహదారిపై గల పాత వంతెనను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పాత వంతెనను పూర్తిగా తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నూతన డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే ఈఈ మల్లారెడ్డి, డీఈ గులాబ్ సింగ్, ఏఈ సల్లావుద్దీన్, నాయకులు అడువాల లక్ష్మణ్, బాలె శంకర్, పంబాల రాము కుమార్, జావేద్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



పాత వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

బాధిత కుటుంబాలకు పరామర్శ

వెల్గటూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం రాజక్కపల్లి గ్రామానికి చెందిన దొరిశెట్టి నిక్షిత్ వర్మ ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం నిర్వహించిన అంతిమ యాత్రలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నిక్షిత్ వర్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించి, ప్రగాఢ సంతాపం తెలిపారు.

●కథలాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో వివిధ ప్రమాదాల్లో గాయపడ్డ వారిని సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. దుంపెటలో మాజీ ఎంపీటీసీ మల్యాల రమేశ్ అన్న అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వెలిబుచ్చారు. అదేవిధంగా చింతకుంట, రాజారాం తండా గ్రామాల్లో రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ బెజ్జారపు లక్ష్మీనర్సయ్య, పెడిమెల్లి గంగారాం, దూడ రాజం కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ జడ్‌పీటీసీ నాగం భూమయ్య, మాజీ ఎంపీటీసీలు మామిడిపల్లి రవి, బొడ్డు బాలు, మాజీ వైస్ ప్రెసిడెంట్ గండ్ర కిరణ్‌రావు, దేవేంధర్‌రెడ్డి, ముస్కరి కిరణ్, లింబాద్రి, రాజగంగారాం తదితరులు ఉన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న వలసజీవి మృతదేహం

మల్లాపూర్, మే, 12 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్‌కు చెందిన పోగుల నరేష్(23) అనే యువకుడు బెహరాన్ దేశంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. దీంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

-బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరి మృతి



విత్విన్ (ఫైల్)



మల్లేశం(ఫైల్)

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో పాదం మల్లేశం(35) అనే యువకుడితో పాటు 18 నెలల చిన్నారి విత్విన్ మృతిచెందారు. జగిత్యాల పట్టణంలోని హనుమాన్‌వాడకు చెందిన పాదం మల్లేశం, తన తమ్ముడి కూతురు విత్విన్‌కి చాక్లెట్ కొనివ్వడానికి ఇంటి నుంచి బైక్‌పై తీసుకువెళ్లాడు. ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న సమయంలో ప్రధాన రహదారిపై ఓ కారు అదుపుతప్పి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న చిన్నారి విత్విన్, పాదం మల్లేశంలు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు ఆసుపత్రికి తరలించే క్రమంలో పాదం మల్లేశం, విత్విన్‌లు మృతి చెందారు. జగిత్యాల డీఎస్పీ రఘు చందర్, పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ కిరణ్ కుమార్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మల్లేశం, విత్విన్‌ల మృతితో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

ఎప్‌సెట్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

-అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్-2025 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన సోమవారం ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎప్‌సెట్ ఫలితాల్లో విద్యార్థులు మధు 1,551వ ర్యాంకు, అంకిత్‌సాయి 3,005, గోపిక హర్షిత 3,156, హర్షిత్ 4,518, సాకేత్ 5,881, అభినవ్ 7,606, సిద్ధార్థ 8,399, గ్లాడిస్ 11,007, సన్నిధి 15,167, రాము 15,906 ర్యాంకులు సాధించినట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ర్యాంకులు

రాయికల్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎప్‌సెట్-2025 ఫలితాలలో ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన ఎం.దుర్గేష్ 18742 ర్యాంక్ (అగ్రికల్చర్, ఫార్మసీ), ఎ.అఖిలేష్ 28181 ర్యాంక్ (ఇంజనీరింగ్), ఎ.ఫణీందర్ రెడ్డి 68433 ర్యాంక్ (ఇంజనీరింగ్), ఎస్.ప్రదీప్ 96733 ర్యాంక్ (ఇంజనీరింగ్), డి.చందు 48592 ర్యాంక్ (అగ్రికల్చర్, ఫార్మసీ), ఎ.అంజన్న 48372 ర్యాంక్ (అగ్రికల్చర్, ఫార్మసీ)లు సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ ఘనంగా సన్మానించారు.

గ్రీవెన్స్ డేలో బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి 13 మంది బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

అందరి సహకారంతో నవరాత్రోత్సవాలు విజయవంతం

ధర్మపురి, మే 12 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నిర్వహించిన నరసింహ నవరాత్రోత్సవాలు విజయవంతం అయ్యాయని ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు తెలిపారు. ఆలయం ఆవరణలో సోమవారం మండలి చైర్మన్ విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు సహకరించిన ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్‌కు, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్, సతీష్, మున్సిపల్ కమిషన్ కల్లెడ రాజశేఖర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా గీతా యజ్ఞం



స్వామి దర్శనం చేసుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి

ధర్మపురి, మే 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తీగలధర్మారం గ్రామంలో గీతా యజ్ఞం కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణ గీతాశ్రమ 46వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గీతా ఆశ్రమ అధ్యక్షులు వేముల రాజరెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జగిత్యాల గాయత్రి పరివార్‌కు చెందిన యజ్ఞ నిర్వాహకులు వేముల రాంరెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఉదయం శ్రీ కృష్ణ భగవానుడికి అభిషేకం, ధర్మ ధ్వజారోహణం, తులసీ పూజ, గోపూజ నిర్వహించారు. అనంతరం జగిత్యాల విశ్వ గాయత్రీ పరివార్ వారిచే పూర్ణాహుతి నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ పాల్గొన్నారు.

●వెల్గటూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గండ్ర శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెట్‌పల్లి ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు నమ్మాద్రి

మెట్‌పల్లిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి ప్రెస్‌క్లబ్ (వర్కింగ్ జర్నలిస్ట్) కార్యవర్గంను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నాంపల్లి నమ్మాద్రి, ఉపాధ్యక్షుడిగా పుల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మెస్నేని వేణు రావు, సంయుక్త కార్యదర్శిగా బెజ్జరపు నవీన్, కోశాధికారిగా ముదాం శ్రీనివాస్, గౌరవ సలహాదారులు అలాల శంకర్, సౌకత్ అలీ, కోరుకంటి విజయ్, కార్యనిర్వహణ సభ్యుడు అనుపురం సతీష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు సౌడల కమలాకర్ తెలిపారు.

'ప్రజా సంక్షేమానికి కృషి'

రాయికల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. రాయికల్ మండలకేంద్రంలోని 3వ వార్డు తుర్క కాశీనగర్‌లో పైపులైన్ సరిగా లేక నీటి సమస్య ఉండటంతో ఆ సమస్యను స్థానికులు జీవన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. పైపులైన్‌ను సరి చేయించి సమస్యను పరిష్కరించి సోమవారం వాటర్ ట్యాంక్, పైపులైన్‌ను పరిశీలించారు. రాయికల్ మండంలోని భూపతిపూర్, మూటపెల్లి గ్రామాల్లో సోమవారం శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర, స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో మాజీ మంత్రి జీవన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన దాసరి రమేష్ దుబాయ్‌లో రోడ్డు ప్రమాదానికి గురి కాగా వారి కుటుంబసభ్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న వైద్య సిబ్బంది

జగిత్యాల అగ్రికల్చర్, మే 12(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మోతెవాడ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, నర్సులతో కేక్ కట్‌చేయించి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ సృజన్‌కుమార్, సంఘశీల, సీవో మధుకర్, దివ్యభారతి, సురేష్‌నాయక్, ఏఎన్ఎంలు శిరీష, పద్మ, జ్యోతి, నాగరాణి, ఉజ్వల, భారతి, రాధిక, సత్యనారాయణ తదితరులున్నారు.

●ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నర్సింగ్ అధికారులు, టీఎస్ఓపీ ప్రతినిధులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించి, 30మంది నర్సింగ్ అధికారులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ విభాగంకు ఫ్లోరెన్స్ నైటింగల్ చేసిన సేవలకు గుర్తుగా ఆమె జన్మదినాన్ని ఇలా వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. అందులో భాగంగానే రక్తదానం నిర్వహించి, కేక్ కట్ చేసి, సంబరాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు రవికిరణ్, సుజన్, దామోదర్, రాజేందర్, శేఖర్, వెంకటసుబ్బయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

●గ్రామీణ, పట్టణ ప్రాంతంలో రోగులకు సేవలందిస్తున్న నర్సుల సేవలు అభినందనీయం అని తెలంగాణ ఆల్ సీనియర్స్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశిష్ట సేవలందించిన డాక్టర్‌లకు, నర్సుల విభాగానికి చెందిన విశిష్ట సేవకులకు హరి అశోక్‌కుమార్‌తో పాటు, సామాజిక సేవకులు రాజగోపాలచారిలు ఉత్తమ సేవా పురస్కారాలు అందించి, వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్మల ప్రకాష్‌రావు, డాక్టర్‌లు, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.

●పెగడపల్లి: పెగడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినం సందర్భంగా మోడరన్ నర్సింగ్‌కి తను చేసిన సేవలను గుర్తుంచుకుని కేక్ కట్ చేస్తున్నట్లు ఈ సందర్భంగా వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి నర్సుల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పెగడపల్లి మండల వైద్యాధికారి నరేష్, సీహెచ్ఓ మహేందర్ రెడ్డి, నర్సింగ్ ఆఫీసర్ రవికిరణ్ పవాడి , శ్రీలత, ధనలక్ష్మి, ద్వారక, కల్పన, భాస్కర్ పాల్గొన్నారు.

●రాయికల్: రోగులకు నర్సులు అందించే వైద్య సేవలు వెలకట్టలేనివని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శశికాంత్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, మాజీ జడ్‌సీలు మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షుడు కుర్మ సుదర్శన్ రెడ్డి, లయన్స్ సభ్యులు వాసం ప్రసాద్, ఆడెపు రాంప్రసాద్, బొమ్మకంటి నవీన్, సాంబారు శ్రీనివాస్, డాక్టర్ వొడ్నాల రజిత, డాక్టర్ అనిల్, ల్యాబ్ టెక్నీషియన్ మోసారపు సంతోష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ ప్రజావాణి

జగిత్యాల అగ్రికల్చర్, మే 12(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీయర్ సాలియా నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూన్ 17న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇప్పటివరకు 700 ఫిర్యాదులు రాగా, 600 ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మల్లాపూర్, మే, 12 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి తడిసి మొలకెత్తిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని టీటీడీపీ కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మొగిలిపేట, సిర్పూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జాతర



దుంపెటలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుంపెటలో సోమవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర ఘనంగా జరిగింది. కొండపై వెలిసిన స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. భక్తులు ఉపవాస దీక్షలతో స్వామికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కోరుట్ల డిపో నుంచి జాతర సందర్భంగా అదనంగా బస్సులు నడిపారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజల్లో పాల్గొనగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేములవాడ నియోజవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహా రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాయికల్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని మూటపెల్లి, భూపతిపూర్ గ్రామాల్లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కళ్యాణం, జాతర మహోత్సవాల్లో సోమవారం మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బర్కం మల్లేష్, రాయికల్ పట్టణ, మండల కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రాణిసాయి కుమార్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, మాజీ సర్పంచులు చంద్రశేఖర్, తిరుపతి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజేందర్ గౌడ్, ప్రశాంత్ రావు, లక్ష్మణ్, గంగారాం, హరీష్, తిరుపతి, అంజన్న పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కథలాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలైన అర్హులకే ప్రభుత్వం అందించనున్న పక్కా ఇల్లు ఇవ్వాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్‌కు సోమవారం బీజేపీ నాయకులు వినతి అందజేశారు. ప్రస్తుతం ఇళ్ళ లబ్దిదారుల గుర్తింపు కోసం సర్వే కొనసాగుతున్న నేపథ్యంలో అర్హులనే గుర్తించి వారికి న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం చేయవద్దని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, సీనియర్ నాయకులు రాచమడుగు వెంకటేశ్వర్ రావు, సత్యనారాయణ, గాంధారి శ్రీనివాస్, కథలాపూర్ మహేశ్, నరెడ్డ రవి, గడ్డం జీవన్‌రెడ్డి ఉన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

బీర్‌పూర్,మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్లపెల్లి, కోమన్‌పెల్లి గ్రామాలలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్య క్రమాన్ని మండల వ్యవసాయ అధికా రుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేష్, సౌజన్య, వ్యవసాయ అధికారులు వినోద్, శిరీష, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.